# మనం మెదక్ సంగారెడ్డి సిద్దిపేట

బుధవారం | 11 | అక్టోబర్ | 2023 | పేజీలు : 5




## కాంగ్రెసోళ్లు ఢిల్లీలో ఎక్కువ..గల్లీలో తక్కువ

- గౌరవెల్లిని అడ్డుకున్న కాంగ్రెస్, బీజేపీ
- కేసీఆర్‌కు 'హుస్నాబాద్' లక్ష్మీ నియోజకవర్గం
- ప్రతిపక్షాలకు దిమ్మతిరిగేలా బీఆర్ఎస్ మ్యానిఫెస్టో
- బీఆర్ఎస్ హ్యాట్రిక్ కొట్టడం పక్కా
- కేసీఆర్ సభను విజయవంతం చేయాలి
- రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు



4 లో



- తేలని అభ్యర్థిత్వాలు
- ఒక వైపు ప్రచారంలో కారు జోరు
- అయోమయంలో ప్రతిపక్ష కార్యకర్తలు



# టిక్కెట్ ఎవ్వరికి?





సిద్దిపేట, అక్టోబర్ 10, మనం న్యూస్ ప్రతినిధి.....

సార్వత్రిక ఎన్నికలకు షెడ్యూల్ వెలువడ్డప్పటికీ బిఆర్ఎస్ మినహా మరే పార్టీలోనూ ఆశించిన స్థాయిలో వేగం కనిపించడం లేదు. అధికారంలోకి రావడమే లక్ష్యమంటూ స్పీచ్‌లు దంచడం తప్పదితే ఆచరణలో మాత్రం అంత ఆశాజనకంగా కనిపించడం లేదు. మరీ ముఖ్యమంగా సిద్దిపేట జిల్లాలో ఈ పరిస్థితి కాస్త ఎక్కువగానే ఉందన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో భాగమైన సిద్దిపేటలో ఉన్న నాలుగు అసెంబ్లీ స్థానాల్లో ఎవరు పోటీ చేస్తారనే విషయంలో స్పష్టత రాకపోవడం మూలంగా కార్యకర్తల్లో అంతకంతకూ నైరాశ్యం పెరుగుతోంది. గత రెండు నెలల నుండే బిఆర్ఎస్ పార్టీ ఎన్నికలకు పూర్తి స్థాయిలో సంసిద్ధమై ఏకకాలంలో అభ్యర్థుల ప్రకటన, బిఆర్ఎస్ ముఖ్య నాయకుల జిల్లా టూర్లు, ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలతో షెడ్యూల్ వెలువడే అరగంట ముందు వరకు బిజీబిజీగా గడిపారు. బిఆర్ఎస్ పార్టీ సిద్దిపేట జిల్లాలో అత్యంత బలంగా ఉందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. గజ్వేల్ నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు, సిద్దిపేట నుండి మంత్రి హరీష్‌రావులు ప్రాతినిధ్యం వహిస్తుండడంతో ప్రతిపక్ష పార్టీలు అభ్యర్థులను ఖరారు చేయడంలో ఆచితూచి అడుగేస్తున్నాయనే చెప్పవచ్చు. ఈనెల 15వ తేదీన మేనిఫెస్టోను ప్రకటించడే కాకుండా అచ్చొచ్చిన హుస్నాబాద్ నియోజకవర్గం నుండి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టునున్నారు. మరో రెండు రోజుల్లో హుస్నాబాద్‌లో, మరో రెండు రోజుల గడువు లోనే సిద్దిపేటలో కేసీఆర్ నేతృత్వంలో

మిగతా 2లో..

---

## రైతురుణమాఫీ, కొత్త రుణాల ప్రక్రియ వేగవంతం చేయాలి

-బ్యాంకర్లు పెండింగ్ పనులపై దృష్టి సారించాలి

-జిల్లా అడిషనల్ కలెక్టర్ గరిమా అగ్రవాల్



3 లో

## 17న ప్రగతి ప్రజా ఆశీర్వాద సభ

-హాజరుకానున్న ముఖ్యమంత్రి కేసీఆర్

-మీ ఆశీర్వాదంతో ఈ స్థాయికి

-50 రోజులు నా కోసం... ఐదేండ్లు మీ సేవలో

-రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు

2 లో



# టికెట్ ఎవ్వరికి ?

మొదటి పేజీ తరువాయి..

బహిరంగ సభ జరగనుందన్న సమాచారం తెలుస్తుంది. ఏది ఏమైనా కారు ప్రచారంలో దూసుకుపోతుంటే ప్రతిపక్షాలు మాత్రం కనీసం పదిశాతం కార్యక్రమాలను కూడా నిర్వహించలేకపోతున్నారని, కార్యకర్తల్లో ఆవేదన వ్యక్తమవుతుంది.

ప్రకటించేదెప్పుడు?

కాంగ్రెస్, బీజేపీ పార్టీలు అభ్యర్థులను ఎప్పుడు ప్రకటిస్తారన్న ఉత్కంఠ సర్వత్రా వ్యక్తమవుతుంది. అభ్యర్థులను ముందస్తుగా ప్రకటిస్తే పూర్తి స్థాయిలో ఎన్నికలకు సిద్ధమవడమే కాకుండా ఆర్థిక పరమైన అంశాల ఇబ్బంది లేకుండా కూడా చూసుకునే వెసులుబాటు ఉంటుంది. అయితే అభ్యర్థులను ప్రకటించడంలో ఆలస్యమవుతున్న కొద్దీ పార్టీని నమ్ముకున్న వారి మధ్య విభేదాలు వచ్చే పరిస్థితులూ ఉంటాయి. ఈ నేపథ్యంలోబీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు ఎంత తొందరగా వీలైతే అంత తొందరగా అభ్యర్థులను ప్రకటిస్తే అనుకున్న స్థాయి ఫలితాలు వస్తాయన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది. సిద్దిపేట జిల్లాలోని బిఆర్ఎస్ పక్షాన సిద్దిపేట నియోజకవర్గం నుండి టి. హరీష్‌రావు, గజ్వేల్ నుండి కేసీఆర్, దుబ్బాక నుండి కొత్త ప్రభాకర్‌రెడ్డి, హుస్నాబాద్ నుండి వొడితల సతీష్‌కుమార్, జిల్లా పరిధిలో ఆనుకొని ఉన్న మానకొండూరు నుండి రసమయి బాలకిషన్ పేర్లు, జనగామ నుండి పల్లా రాజేశ్వర్ పేరు కూడా దాదాపు ఖరారు కాగా ఇప్పటికే మండలాల వారీగా ఆత్మీయ సమావేశాలు , విద్యార్థి విభాగం, సోషల్ మీడియా కన్వీనర్లతో భేటీలు, ఓటరు లిస్టుల అందజేత, వంద మందికి ఒక ఇంచార్జ్ చొప్పున నియామకం, 15వ తేదీన మేనిఫెస్టో, మరుక్షణం నుండే జిల్లాలో పర్యటనలు కేసీఆర్ నేతృత్వంలో సాగడంతో బిఆర్ఎస్‌లో ఉత్సాహం కనిపిస్తూ మూడోసారి కేసీఆరే అన్న స్లోగన్ వినిపిస్తోంది. ఇక కాంగ్రెస్, బీజేపీలు అభ్యర్థులను ఖరారు చేసే విషయంలో అధిష్ఠానాలు ఆచితూచి వ్యవహరించడంతో కార్యకర్తల్లో నైరాశ్యం కనిపిస్తోంది. ఏ ఒక్క నియోజకవర్గంలోనూ కాంగ్రెస్ పార్టీకి ప్రాతినిధ్యం లేకపోయినప్పటికీ రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజలు సానుకూలంగా ఉన్నారన్న బలంతోనే టికెట్లను ఆశించే వారి సంఖ్య అంతకంతకూ పెరుగుతూ వస్తోంది.

గజ్వేల్ నుండి తూంకుంట నర్సారెడ్డి, సిద్దిపేట నుండి మర్కంటి భవానిరెడ్డి, దరిపల్లి చంద్రం, పూజల హరికృష్ణలు, దుబ్బాక నుండి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, కత్తి కార్తీక, హుస్నాబాద్ నుండి పొన్నం ప్రభాకర్, ప్రవీణ్‌రెడ్డి, జనగామ నియోజకవర్గం నుండి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిల పేర్లు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తున్నప్పటికీ అధికారికంగా ప్రకటించకపోవడంతో వీరికే అవకాశం దక్కుతుందా, లేదా మరెవరికైనా టికెట్ ఇస్తారన్న ఆవేదనను కార్యకర్తలు వ్యక్తం చేస్తున్నారు. బీజేపీ పార్టీలోనూ ఇదే సాగదీత ధోరణి కనిపిస్తోంది. గజ్వేల్ నుండి దారం గురువారెడ్డి, దుబ్బాక నుండి సిట్టింగ్ ఎమ్మెల్యే రఘునందన్‌రావు, సిద్దిపేట నుండి దూది శ్రీకాంత్‌రెడ్డి, కొత్తపల్లి వేణుగోపాల్, హుస్నాబాద్ నుండి శ్రీరాం చక్రవర్తి, మంజుల రెడ్డి, జనగామ నుండి సురేష్‌గౌడ్, సురేష్‌లు టికెట్‌లు ఆశిస్తున్నప్పటికీ ఎప్పుడు ఎవరికి అధిష్ఠానం ఆశీస్సులు ఉంటాయో తేలాల్సి ఉంది. అభ్యర్థుల ప్రకటన ఆలస్యమవుతున్నకొద్దీ అభ్యర్థులకు ప్రచారం చేసుకునే అవకాశం దక్కకపోవడంతోపాటు ఆర్థికపరమైన సమస్యలు కూడా ఎదురయ్యే అవకాశం ఉంది. ఏది ఏమైనా ఆలస్యమైతే మాత్రం ఆశలు అడియాశలవుతాయన్న కార్యకర్తల అభిప్రాయాన్ని మన్నించి అధిష్ఠానాలు వెనువెంటనే టికెట్లను ప్రకటించాలని కోరుతున్నారు.

## లైసెన్స్ తుపాకులను డిపాజిట్ చేయాలి

### నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణ

### పోలీస్ కమీషనర్ శ్వేత



సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 10, మనం న్యూస్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున లైసెన్స్ తుపాకులు కలిగి ఉన్న వ్యక్తులు వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లలో తమ తుపాకులను డిపాజిట్ చేయాలని పోలీస్ కమీషనర్ శ్వేత అన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ లైసెన్స్ కలిగి ఉన్న తుపాకులను ఈనెల 16వ తేదీ లోపు డిపాజిట్ చేయని వారిపై ఎన్నికల కమీషన్ ఆదేశానుసారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. లైసెన్స్ తుపాకులు డిపాజిట్ చేసిన వారు ఎన్నికలు ముగిసిన తర్వాత తీసుకోవచ్చన్నారు. పారదర్శకంగా నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎన్నికల కమీషన్ ఆదేశాలను ప్రజలు, ప్రజాప్రతినిధులు తప్పకుండా పాటించాలని సూచించారు. జిల్లా బార్డర్లలో పోలీస్ స్టేషన్‌లలో 10 చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడం జరిగిందని, 24 గంటలు వాహనాలు తనిఖీ చేయడం జరుగుతుందన్నారు.

## హరీష్‌రావు వెంటే మేమంతా



చిన్నకోడూరు, అక్టోబర్ 10, మనం న్యూస్: తాము అడిగిన వెంటనే తమ అవసరాలను తీర్చే మా నాయకుడు మంత్రి హరీష్‌రావు వెంటే మేమంటూ మండల ఏకలవ్య పందుల పెంపకందారుల సహకార సంఘం సభ్యులు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో గంపగుత్తగా మా ఓట్లన్నీ హరీష్‌రావుకే వేస్తామంటూ ఏకగ్రీవ తీర్మాణం చేసి తీర్మాణ పత్రాన్ని ఎంపిపి మాణిక్యరెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు కామిని శ్రీనివాస్‌లకు అప్పగించారు. మండల కేంద్రంలోని రెడ్డి సంఘంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ఎన్నడూ తమను పట్టించుకోలేదని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఎరుకలకు సముచిత స్థానం కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు ఉమేష్‌చంద్ర, ఎంపిటిసిల ఫోరం అధ్యక్షులు శ్రీనివాస్, వైస్ ఎంపిపి పాపయ్య, , ఉప సర్పంచ్ శ్రీకాంత్, ఏకలవ్య సంఘం అధ్యక్షులు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి బండి తిరుపతి, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత మెగా వైద్య శిభిరం



కొండపాక, అక్టోబర్ 10, మనం న్యూస్: కొండపాక మండల పరిధిలోని దమ్మక్కపల్లి గ్రామంలో మెడిసిటీ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిభిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిభిరంలో బిపి, షుగర్ పరీక్షలు, కంటి పరీక్షలతోపాటు చెవి, ముక్కు, గొంతు, వరిబీజము, బీజకుట్టు, గడ్డలు, కణతులు, థైరాయిడ్ గడ్డలు, గర్భసంచికి సంబంధించిన సమస్యలు కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు, చర్మ సమస్యలు, మోకాళ్ల నొప్పులు, నడుము నొప్పులు, ఊపిరితిత్తుల సమస్యలు పరీక్షించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ శిభిరంలో 120 మందికి బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఆపరేషన్ అవసరమైన వారికి 35 మందిని మెడిసిటీ ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు వైద్యులు తెలిపారు. వారికి ఆసుపత్రిలో ఆపరేషన్‌లు నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లేశం, వైద్యులు డా. అఖిల, భాస్కర్, ఆనంద్, మార్కెటింగ్ నవీన్ , గ్రామస్తులు పాల్గొన్నారు.



## అంగన్‌వాడీ చోరీ నిందితుడి అరెస్ట్

### 24 గంటల్లోనే ఛేదించిన మిరుదొడ్డి పోలీసులు

మిరుదొడ్డి, అక్టోబర్ 10, మనం న్యూస్: మిరుదొడ్డి మండల పరిధిలోని ధర్మారం గ్రామంలోని అంగన్‌వాడి కేంద్రంలో చోరీ ఘటనకు పాల్పడిన నిందితులను మిరుదొడ్డి పోలీసులు 24 గంటల్లోనే పట్టుకున్నారు. మిరుదొడ్డి ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం అంగన్‌వాడి కేంద్రంలో దొంగిలించిన పోషకాహారాలు, ఇతరత్రా సామాగ్రి గురించి దర్యాప్తు చేస్తుండగా అదే గ్రామానికి చెందిన అరవింద్ అనే వ్యక్తిపై అనుమానంతో అతని ఇంట్లో పరిశీలించగా పలు సరుకులపై సీఎం కేసీఆర్ బొమ్మ ఉండడం గుర్తించడం జరిగిందన్నారు. అతనిపై అనుమానంతో ఇళ్లంతా సోదా చేయగా అంగన్‌వాడి కేంద్రంలో దొంగిలించిన సరుకులను రికవరీ చేయడం జరిగిందని, నిందితుడు అరవింద్‌ను సైతం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు.




## 17న ప్రగతి ప్రజా ఆశీర్వాద సభ



సిద్దిపేట, అక్టోబర్ 10, మనం న్యూస్ ప్రతినిధి: ఒకనాటి సిద్దిపేట నినాదాలు నేడు నిజమయ్యాయి. కేసీఆర్ నేతృత్వంలో వాటిని నిజం చేసే సందర్భంలో భాగమైనందుకు నేనెంతో అదృష్టవంతున్ని. మీరెంతో ప్రేమతో ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించి ఆశీర్వదించారని, మరోమారు మీ ఆశీర్వాదం నాపై ఉండాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు కోరారు. ఈనెల 17వ తేదీన సిద్దిపేటలో నిర్వహించనున్న సీఎం కేసీఆర్ ప్రగతి – ప్రజా ఆశీర్వాద సభ పేరుతో లక్ష మందితో నిర్వహిస్తున్న బహిరంగ సభకు ముఖ్యమంత్రి కేసీఆర్ ముఖ్యమంత్రిగా హాజరవుతున్నారని, నాడు పని చేసిన ఉద్యమ స్ఫూర్తితో నేడు సభ విజయవంతానికి కృషి చేయాలన్నారు. 17వ తేదీన జరిగే సభకు జన సమీకరణ నిమిత్తం మంగళవారంనాడు సిద్దిపేటలో ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. సిద్దిపేట నాడు ఉద్యమానికి, నేడు అభివృద్ధికి దిక్సూచిగా నిలుస్తూ వస్తుందన్నారు. ఒకనాడు సిద్దిపేటకు సాగునీరు, రైలు, జిల్లా ఏర్పాటు కలలన్నీ నెరవేరాయి. నినాదాలన్నీ నిజమైన సందర్భంలో సిద్దిపేట గడ్డను పునీతం చేసిన కారణజన్ముడు సీఎం కేసీఆర్ సిద్దిపేటలో సార్వత్రిక ఎన్నికల సమరశంఖారావాన్ని పూరించనున్నారన్నారు. 17వ తేదీన సాయంత్రం ప్రగతి ప్రజా ఆశీర్వాద సభ పేరుతో నిర్వహిస్తున్న సభను విజయవంతం చేయాలన్నారు. కేసీఆర్ ఆశీర్వాదంతో మీరంతా ఎంతో ప్రేమాభిమానాన్ని చూపుతూ ఆరుసార్లు గెలిపించారని, మరోమారు మీ ఆశీర్వాదం కోసం మీముందున్నానన్నారు. రాబోయే 50 రోజులు నాకోసం కష్టపడండి, ఐదేళ్లు మీ సేవలో ఉంటా... అభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుతా.. ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలు, ప్రతి ఊరు ప్రగతి పథంలో పరుగెత్తిస్తానన్నారు. ప్రతిసారి మీరెంతో ప్రేమతో మెజార్టీని పెంచుతూ వచ్చారని, అదే స్థాయిలో సిద్దిపేట పేరును జాతీయ స్థాయిలో ఇనుమడింపజేస్తున్నానన్నారు. సిద్దిపేట ప్రజలు తనకుటుంబ సభ్యులని, మీ ప్రేమ నా శ్వాస అని చివరి శ్వాస వరకు మీ సేవలోనే తరిస్తానన్నారు.

–ఔర్ ఏక్ దక్కా... డేడ్ లాక్ పక్కా

సీఎం కేసీఆర్ సభకు హాజరైన పార్టీ ముఖ్య నాయకులు మాట్లాడుతూ నాడు కేసీఆర్, అదే స్ఫూర్తితో హరీష్‌రావు సిద్దిపేట ఖ్యాతిని నలు దిక్కులా వ్యాప్తి చేశారని, దేశ వ్యాప్తంగా సిద్దిపేట పేరును అగ్రభాగాన నిలిపిన హరీష్‌రావుకు అండగా ఉంటామంటూ ఏకగ్రీవ తీర్మాణం చేశారు. నాడు ఉద్యమ స్ఫూర్తితో ఈ ఎన్నికల్లో ఔర్ ఏక్ దక్కా... డేడ్ లాక్ పక్కా... అనే నినాదంతో ముందుకు సాగుతామని, ప్రతి ఒక్కరిని ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేస్తామన్నారు. రాబోయే 50 రోజులు హరీష్‌రావు గెలుపే లక్ష్యంగా దీక్షతో ముందుకు సాగుతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాధాకృష్ణశర్మ, రాజనర్సు, మారెడ్డి రవిందర్‌రెడ్డి, చిన్న, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, పాల సాయిరామ్,

# రైతురుణమాఫీ, కొత్త రుణాల ప్రక్రియ వేగవంతం చేయాలి

### బ్యాంకర్లు పెండింగ్ పనులపై దృష్టి సారించాలి

### జిల్లా అడిషనల్ కలెక్టర్ గరిమా అగ్రవాల్




సిద్దిపేట, అక్టోబర్ 10, మనం న్యూస్ ప్రతినిధిః రైతులకు రుణమాఫీ ప్రక్రియ, కొత్త రుణాల పంపిణీ ప్రక్రియను బ్యాంకర్లు వేగవంతం చేయాలని సిద్దిపేట జిల్లా అడిషనల్ కలెక్టర్ గరిమా అగ్రవాల్ అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయ సమావేశ మందిరంలో జిల్లాలోని బ్యాంకు అధికారులు, వ్యవసాయ అధికారులతో రైతు రుణమాఫీ ప్రక్రియ, కొత్త రుణాల పంపిణీ గురించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ ఏపిజివిబి బ్యాంకులో 7876 మంది రైతులకు రూ. 33.26 కోట్లు, ఎస్‌బిఐ బ్యాంక్‌లో 2740 మందికి రూ. 21.92 కోట్లు, యుబిఐ బ్యాంక్‌లో 2762 మంది రైతులకు రూ. 15.45 కోటుట్ల, ఇతరత్రా బ్యాంకుల్లో సుమారు 10272 అకౌంట్లకు రూ. 25 కోట్లు పెండింగ్‌లో ఉన్న రైతు రుణమాఫీ నగదును వేగంగా రైతులకు అందించాలని బ్యాంకర్లకు సూచంచారు. డిబిటి ఫెయిల్యూర్‌లో ఉన్న 199 ఖాతాలకు రైతు రుణమాఫీ పోర్టల్‌లో ఎస్‌బిఐ, ఏపిజివిబి బ్యాంకుల్లో అప్‌లోడ్ చేయాలని కోరారు. వివిధ బ్యాంక్‌లలో పెండింగ్‌లో ఉన్న రుణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వ్యవసాయ అధికారులు కొత్త రుణాలు పొందేందుకు అర్హత కలిగిన రైతులకు బ్యాంకర్లతో సమావేశమై రుణాలందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులతో సమావేశాలు నిర్వహించి క్రాప్‌లోన్‌లు తీసుకునేలా రైతులను ప్రోత్సహించాలని, బ్యాంకులు రోజుకు వంద చొప్పున రుణాలు అందించాలన్నారు. అదేవిధంగా మున్సిపాలిటీ పరిధిలో వీధి వ్యాపార రుణాలను మెప్మా అధికారుల సాయంతో బ్యాంకు మేనేజర్‌లు అందించాలని ఆదేశించారు. ఆహార ఉత్పత్తి, పిఎంఎఫ్ఎంఈ పరిధిలోని 54 యూనిట్లు వేగంగా పూర్తి చేయాలన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్నందున బ్యాంకు, వ్యవసాయ అధికారులు ఎన్నికల కమీషన్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ సత్యజిత్, డిఆర్‌డిఏ పిడి జయదేవ్ ఆర్యాతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి వ్యక్తికి మానసిక ఆరోగ్యం చాలా అవసరం

### సురభిలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాలు



సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 10, మనం న్యూస్ః నేడు పెరుగుతున్న నాగరికతలో శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కూడా ఎంతో అవసరమని సురభి కళాశాల మానసిక వైద్య విభాగం డాక్టర్ హరీష్ పిన్నోజి అన్నారు. మంగళవారం సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి సమీపంలోని సురభి సైన్స్ అండ్ మెడికల్ కళాశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవ వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుల బృందం మాట్లాడుతూ నేటి ఆహారపు అలవాట్లు ధూమపానం, మద్యపానం, ఆలోచన విధానం, పని ఒత్తిడి వల్ల కలిగే మానసిక స్థితిగతుల గురించి రోగులకు వివరించారు. యోగా చేయడం, వైద్యుల సలహాలు పాటించడం వల్ల శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. సురభి కళాశాలలో మానసిక ఆరోగ్యానికి సంబంధించి అన్ని రకాల సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు శివరామ చారి, డా. రాజేష్, డా. రఫీ, పిఆర్ఓ పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సొంత ఖర్చులతో లైసెన్స్‌లు అందజేత



దౌల్తాబాద్, అక్టోబర్ 10, మనం న్యూస్ః దుబ్బాక నియోజకవర్గంలోని యువతీ యువకులకు ఎమ్మెల్యే రఘునందన్‌రావు సొంతంగా డ్రైవింగ్ లైసెన్స్‌లు పంపిణీ చేయడం జరుగుతుందని అప్పాయిపల్లి గ్రామ ఉప సర్పంచ్ కేశబోయిన ప్రభాకర్ అన్నారు. మంగళవారం రోజున మండల పరిధి లోని అప్పాయిపల్లి గ్రామంలో 20 మంది యువకులకు తన సొంత డబ్బులతో డ్రైవింగ్ లెర్నింగ్ లైసెన్స్‌లను అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపి గ్రామాధ్యక్షులు రాజోల గణేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా మేరీ మిట్టీ మేరీ దేశ్

### సుభాష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా కలశపూజ

దుబ్బాక, అక్టోబర్ 10, మనం న్యూస్ః ప్రధాని నరేంద్రమోదీ తలపెట్టిన మేరా మిట్టీ మేరా దేశ్ కార్యక్రమాన్ని దుబ్బాక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మున్సిపల్ అధ్యక్షులు కిష్టమ్మగారి సుభాష్‌రెడ్డి ఆధ్వర్యంలో కలశపూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రధాని పిలుపు మేరకు మేరా మిట్టి మేరా దేశ్ అనే కార్యక్రమాన్ని భారత సంస్కృత శాఖ, కేంద్రమంత్రి, రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందన్నారు. పూజలు నిర్వహించిన అనంతరం జిల్లా కేంద్రానికి కలశం పంపించడం జరుగుతుందని, జిల్లా కేంద్రం నుండి ఢిల్లీకి పంపించి అక్కడ ఏర్పాటు చేసిన అమృత వాటిక సిటీలో స్వాతంత్ర్య సమరయోధులకు గుర్తుగా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ప్రధాని మోదీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల స్మారకం నిర్మాణానికి ఈ మహత్కార్యానికి దేశ ప్రజలను భాగస్వాములను చేస్తున్నందుకు వారికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబటి బాలేష్ గౌడ్, కౌన్సిలర్ మట్ట మల్లారెడ్డి, తొగుట రవిందర్, కొండె ఎల్లారెడ్డి, సుంకోజి ప్రవీణ్, బాచి, శ్రీకాంత్, , బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.





## ఈ నెల 23న దసరా పండుగ

### పురోహితులు వితల రాజపున్నయ్యశర్మ

మిరుదొడ్డి, అక్టోబర్ 10, మనం న్యూస్ః ఈ సంవత్సరం విజయదశమి పండుగను అక్టోబర్ 23వ తేదీ సోమవారం రోజున జరుపుకోవడం శాస్త్రోపనీయం ప్రకారం ఎంతో ఉత్తమమని గ్రామ పురోహితులు వితల రాజపున్నయ్యశర్మ తెలిపారు. మంగళవారం రోజున ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మంగళవారం రోజున దశమికి ముఖ్య గౌణకాల వ్యాప్తి లేనందున సోమవారం శ్రవణ నక్షత్ర దశమి స్వర్శమగుట వలన నక్షత్రాలు ఉదయించు సమయము విజయదశమి వ్యాప్తి ఉన్నందున సోమవారం రోజున ప్రజలు విజయదశమి పండుగను జరుపుకోవడం శాస్త్రసమ్మతమని పురోహితులు వితల రాజపున్నయ్యశర్మ పేర్కొన్నారు. 22వ తేదీ ఆదివారం నాడు సద్దుల బతుకమ్మ జరుపుకొని, 23వ తేదీన దసరా పండుగను జరుపుకోవాలని సూచించారు.

## డివిజన్ సాధించే వరకు పోరాటం ఆగదు

### ఫోటో వీడియో గ్రాఫర్ల సంఘం




చేర్యాల, అక్టోబర్ 10, మనం న్యూస్ః చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధించే వరకు పోరాటం ఆపేది లేదని ఫోటో, వీడియో గ్రాఫర్ల సంఘం యూనియన్ జిల్లా అధ్యక్షులు డొంతు శ్రీకాంత్ అన్నారు. చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన దీక్షలు మంగళవారం 30 రోజులకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో నాలుగు మండలాల ఫోటో, వీడియోగ్రాఫర్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు. వారికి ఆయా పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సంరదర్భంగా వారు మాట్లాడుతూ చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన కోసం జేఏసిగా కొన్ని సంవత్సరాలుగా అనేక పోరాటాలు నిర్వహిస్తుంటే ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంత నాలుగు మండలాల ప్రజల చిరకాల కోరిక ఆకాంక్షను ప్రభుత్వం వెంటనే గుర్తించి రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. ఉద్యమంలో ఫోటో, వీడియోగ్రాఫర్లు సంపూర్ణ మద్దతు తెలుపుతూ భాగస్వాములవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫోటో వీడియో గ్రాఫర్ల యూనియన్ అధ్యక్షులు గుడాల రాజు, ప్రధాన కార్యదర్శి, ఇప్పకాయల పవన్, కోశాధికారి కోయినేని శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు రాజగిరి గోవర్ధన్‌కడుదూరి మహేందర్‌రెడ్డి, కర్క చంద్రారెడ్డి, కొమురవెల్లి అధ్యక్షులు చిప్ప శ్రీనివాస్ దూల్మిట్ట అధ్యక్షులు గొంటిపల్లి కిషన్, కూరపాటి మధు, తాడెం యాదగిరి, నర్సింగరావు, హరి, సురేష్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


## రాజకీయ పార్టీల ఫ్లెక్సీల తొలగింపు



దౌల్తాబాద్, అక్టోబర్ 10, మనం న్యూస్ః రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన సందర్భంగా ఎన్నికల నియమనిబంధనల మేరకు రాజకీయ పార్టీలు, నాయకుల ఫ్లెక్సీలు, ఫోటోలతో కూడిన చిత్రాలను దౌల్తాబాద్ మండల వ్యాప్తంగా గ్రామ పంచాయతీ సిబ్బంది తొలగించడం కనిపించింది. మంగళవారం మండల వ్యాప్తంగా వివిధ పార్టీల నాయకుల ఫ్లెక్సీ ఫోటోలను సిబ్బంది తొలగించారు. నేటి నుండి ఏ రాజకీయ పార్టీ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించినా ఫ్లెక్సీలు వేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్నికల కమీషనర్ ఆదేశాలు జారీ చేశారు.

# కాంగ్రెసోళ్లు ఢిల్లీలో ఎక్కువ..గల్లీలో తక్కువ

హుస్నాబాద్,అక్టోబర్ 10, (మనం న్యూస్)ః కాంగ్రెసోళ్లు ఢిల్లీలో ఎక్కువ..గల్లీలో తక్కువ...ఈ మధ్య వయా బెంగుళూరు అయ్యిందంటూ రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శనస్త్రాలు విసిరారు. పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే సతీశ్ కుమార్ స్వంత కార్యాలయంలో కార్యకర్తల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15 న బీఆర్‌ఎస్ పార్టీ మెనిఫెస్టోను ప్రకటించిన తర్వాత ప్రతిపక్షాల మైండ్ బ్లాక్ అవుతుందన్నారు. ఫేక్ సర్వేల పేరిట కాంగ్రెస్ అధికారంలోకి వస్తామని గ్లోబల్ ప్రచారం చేస్తుందన్నారు. కనీసం టిక్కెట్లు కూడా ఇచ్చుకోలేని దయనీయ స్థితిలో కాంగ్రెస్ పార్టీ ఉందని ఆయన ఎద్దేవా చేసారు. మాటలు, మూటలు, ముఠాలు, మంటలు కాంగ్రెస్ పార్టీ తీరని ఆయన విమర్శించారు.





హుస్నాబాద్ ప్రాంతంలో గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి కాకుండా కాంగ్రెస్, బీజేపీ నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేసారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేసారు. గౌరవెల్లి ప్రాజెక్టు ముఖ్యమంత్రి కేసీఆర్ హుస్నాబాద్‌కు ఇచ్చిన గొప్ప వరమని ఆయన కొనియాడారు. 2009 మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ పెట్టిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని, 2004 లో తెలంగాణ ఇవ్వకుండా టీఆర్‌ఎస్ పార్టీని మింగేయాలని చూసిందన్నారు. మూడు గంటలు, మీటర్లు పెడతామంటున్న కాంగ్రెస్, బీజేపీ మంచివాళ్లో...24 గంటల ఉచిత కరెంటు ఇస్తున్న సీఎం కేసీఆర్ మంచోడో రైతులు ఒకసారి ఆలోచించాలన్నారు. కాంగ్రెస్ సంస్కృతి ముఠాల సంస్కృతని, టికెట్ల కోసం కుస్తీలు పడుతున్నారని ఆయన విమర్శించారు. తెలంగాణ పథకాలను దేశం మొత్తం అమలు చేస్తున్నారని ఆయన తెలిపారు. ఒకప్పుడు తిండి లేని తెలంగాణ నేడు దక్షిణ భారత దేశ ధాన్యబండాగారంగా మారిందన్నారు. వరిధాన్యం, డాక్టర్ల ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రం దేశంలో నెంబర్ వన్ అయ్యిందని ఆయన వెల్లడించారు. కైలాసంలో పెద్దపాము మింగినట్టు తప్పిపోయి కాంగ్రెస్ వాళ్ల చేతిలో పడితే తెలంగాణ అభివృద్ధిలో కిందకి పడిపోతుందన్నారు. హైదరాబాద్‌కు ఈశాన్యం ప్రాంతమైన హుస్నాబాద్ సీఎం కేసీఆర్‌కు లక్ష్మి నియోజకవర్గమని ఆయన తెలిపారు. 2018 లో హుస్నాబాద్‌లో ప్రజా ఆశీర్వాద సభను నిర్వహించి ఇక్కడి నుండే ఎన్నికల ప్రచారాన్ని మొదలుపెట్టి విజయ ఢంకా మోగించారు. అందుకే సీఎం కేసీఆర్ మళ్లీ హుస్నాబాద్ నుండే ఎన్నికల సమరశంఖంను పూరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎవరెన్ని ట్రిక్కులు చేసినా హ్యాట్రిక్ కొట్టేది సీఎం కేసీఆర్ అని ఆయన స్పష్టం చేసారు. ఈ నెల 15 న నిర్వహించే కేసీఆర్ సభకు కార్యకర్తలందరూ సైనికుల్లా పని చేసి జన సమీకరణ చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సభను కరీంనగర్ రోడ్డులోని సబ్‌స్టేషన్ ప్రాంతం వద్ద సభ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. మంగళవారం సభాస్థలిని మాజీ ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే సతీశ్‌కుమా ర్‌లతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ జడ్పీచైర్మన్ సుధీర్‌కుమార్, జడ్పీవైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజారెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి, సుడా చైర్మన్ జి.వి.రామకృష్ణ, ఆయా మండలాల బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులున్నారు.

జిల్లాలో పత్తి కొనుగోళ్లు

# సాఫీగా జరగాలి

**-జిల్లా అదనపు కలెక్టర్ మాధురి**



సంగారెడ్డి, అక్టోబర్ 10, మనం న్యూస్ః జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా పత్తి కొనుగోళ్లు సాఫీగా సాగేలా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ మాధురి సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులు, జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాంతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో 3.58 లక్షల ఎకరాల్లో పత్తిపంట సాగు చేశారన్నారు. 2.51 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి వచ్చే అవకాశం ఉందని, పత్తి నిల్వకు 37 గోడౌన్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. బయోమెట్రిక్ ఆధారంగా డాటాబేస్‌తోనే సిపిఐ కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులు పట్టాపాస్‌బుక్, ఆధార్‌లింగ్ ఉండాలని, తేమశాతం తక్కువ ఉంటే ఎంఎస్‌పి లభిస్తుందని రైతులకు అవగాహన కల్పించానలి వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. 8 శాతం లోపు తేమ ఉన్న పత్తికి కనీస మద్ధతు ధర క్వింటాల్‌కు రూ. 7,020లుగా లభిస్తుందన్నారు. మిల్లుల యజమానులు పత్తి కొనుగోలు కేంద్రాల్లో అవసరమైతే పరికరాలను సమకూర్చుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి మొహమ్మద్ రియాజ్, వ్యవసాయ శాఖ జేడి నరసింహారావు, ఆర్‌టిఏ లీగల్ మెట్రాలజీ, అగ్నిమాపక, పోలీస్ శాఖతోపాటు తదితరులు పాల్గొన్నారు.

# బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడికి ఘన వీడ్కోలు

గజ్వేల్, అక్టోబర్ 10, మనం న్యూస్ః 11 సంవత్సరాల పైబడి జగదేవ్‌పూర్ మండలంలోని మునిగడప జెడ్పి ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయునిగా పని చేసిన ఆదరాసుపల్లి శశిధర్‌శర్మ బదిలీపై వర్గల్ మండలం చౌదర్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు శశిధర్‌శర్మకు పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు భావోద్వేగంతో ఘనమైన వీడ్కోలు పలికారు. శశిధర్‌శర్మ మండల స్థానికులుగా అందరికీ సుపరిచితులని, పలు ప్రభుత్వ కార్యక్రమాల్లో వ్యాఖ్యాతగా వ్యవహరించారని పాఠశాల ఉపాధ్యాయులు కొనియాడారు. అదేవిధంగా దశాబ్ధ కాలంగా పైగా మునిగడప పాఠశాలో పని చేయడంతో విద్యార్థుల తల్లిదండ్రులతో, గ్రామస్తులతో మంచి అనుబంధం ఏర్పడిందన్నారు. శశిధర్‌శర్మ బదిలీపై వెళ్తున్న సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు భావోద్వేగానికి లోనయ్యారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కనకయ్య, పిఆర్‌టియు జగదేవ్‌పూర్ మండల అధ్యక్షులు సి.హెచ్. వెంకట్రామిరెడ్డి, మునిగడప ఉపాధ్యాయుడు మధుసూదన్, వెంకటయ్య, నవీన్, శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ పోచయ్య, శ్రీవాణి సుభాషిని తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా సివిల్ సప్లై సభ్యులు బోనాల నర్సింలుకు శుభాకాంక్షలు



సిద్దిపేట రూరల్, అక్టోబర్ 10, మనం న్యూస్ః సిద్దిపేట జిల్లా సివిల్ సప్లై సభ్యునిగా బోనాల నర్సింలును నియమించిన సందర్భంగా బిఆర్‌ఎస్ సోషల్ మీడియా ఇంచార్జ్ గుడుమల్ల రాజలింగం శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాజలింగం మాట్లాడుతూ నర్సింలు మంత్రి హరీష్‌రావు అడుగుజాడల్లో నడుస్తూ బిఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావం నుండి క్రియాశీలకంగా పని చేస్తూ వస్తున్నారన్నారు. ఆయనకు ఈ అవకాశం కల్పించడం సంతోషంగా ఉందన్నారు. బిఆర్‌ఎస్ పార్టీ ప్రతి ఒక్క కార్యకర్తకు సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బిఆర్‌ఎస్‌వి ప్రధాన కార్యదర్శి సొప్పరి అశోక్, బిఆర్‌ఎస్ నాయకులు చిల్లాపూర్ రాజు, నర్సింలు ఉన్నారు.

# కదన రంగంలోకి కాషాయ దళం





**-దుబ్బాక పౌరుషాన్ని రాష్ట్రానికి తెలియజేయాలి**

**-ముందుగానే ప్రచారం... ఎన్నికల ఫలితాల్లోనూ ముందుంటాం**

**-బీజేపి ప్రచార రథ పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే రఘునందన్‌రావు**

దుబ్బాక టౌన్, అక్టోబర్ 10, మనం న్యూస్‌ః తెలంగాణ రాష్ట్ర సార్వత్రిక ఎన్నికల నగారా మోగిన దృష్ట్యా కరుడుగట్టిన కాషాయవాదులంతా కదం తొక్కి దుబ్బాక నియోజకవర్గంలో మరోసారి బీజేపి జెండా ఎగురవేసేందుకు కదనరంగంలోకి అడుగు పెట్టడం జరుగుతుందని దుబ్బాక ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు పేర్కొన్నారు. వచ్చే నెలలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా దుబ్బాక నియోజకవర్గ బీజేపి పార్టీ ప్రచార రథానికి మంగళవారం రోజున ఎమ్మెల్యే రఘునందన్‌రావు సతీసమేతంగా మారెమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వాహనపూజ నిర్వహించి ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాడు 2020 నవంబర్ నెలలో ఏదైతే ఉద్యమ స్ఫూర్తి, ఉద్యమ పోరాటంతో ఉవ్వెత్తున ఎగిసిపడి ఉప్పెనలా దుబ్బాక గడ్డపై కాషాయ జెండాను ఎగురవేశామో అదే ఉద్యమ స్ఫూర్తితో, ఉద్యమ పోరాటంతో ఈసారి 2023 నవంబర్ నెలలో జరిగే ఎన్నికల్లోనూ అదే ఉత్సాహంతో ముందుకు సాగాలని ఆయన బీజేపి నాయకులు, కార్యకర్తలకు సూచించారు. దుబ్బాక ఉప ఎన్నిక ఫలితాల అనంతరం రాష్ట్రమంతా దుబ్బాక అంటే ఏమిటో, దుబ్బాక ప్రజల సత్తా ఏమిటో, ఇక్కడి ప్రజల చైతన్యం గురించి తెలుసుకున్నారని, అవే ఫలితాలను నేడు తిరిగి పునరావృతం చేసి భారీ మెజార్టీతో దుబ్బాక గడ్డపై మరోసారి కాషాయ జెండాను ఎగురవేసి దుబ్బాక గడ్డ ప్రజల పౌరుషాన్ని యావత్ రాష్ట్రానికి తెలియజేసేలా ప్రతి కార్యకర్త ఒక రఘునందనుడై ముందుకు సాగాలన్నారు. మీ అందరికీ అండగా నేనున్నానని, నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసం మరోసారి గెలిచి వారి రుణం తీర్చుకుంటానన్నారు. ఎన్నికల నియమ నిబంధనలను పాటిస్తూ ఎన్నికల నియమావళి ప్రకారం ప్రచారం సాగించి శ్రీ మారెమ్మ తల్లి దీవెనలతో అందరికంటే ముందుగానే ఉప ఎన్నికల్లో ప్రచారం ప్రారంభించామని, ఇప్పుడు కూడా అందరికంటే ముందుగానే ప్రచారం ప్రారంభించడం జరుగుతుందన్నారు. ముందుగానే ప్రచారం సాగించినట్లుగానే అన్ని పార్టీలకు ముందు వరుసలో నిలిచి ఈ సారి కూడా దుబ్బాక గడ్డపై విజయం సాధిస్తామని పూర్తి విశ్వాసంతో ఉన్నానన్నారు. ప్రజలందరి ఆశీస్సులు బీజేపిపై ఉన్నాయని, దుబ్బాక నియోజకవర్గంలో వచ్చే ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో పెనుమార్పులు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. మరో రెండు రోజుల్లో పూర్తి కార్యాచరణతో ప్రచార కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళ్లాలని, ప్రతి కార్యకర్త ఒక బీజేపి నాయకుడు, ఒక రఘునందన్‌రావు, ఒక ప్రధాని మోదీయే అని, బీజేపిలో తాను కూడా ఒక కార్యకర్తనేనని ఆయన స్పష్టం చేశారు. మనందరి కృషి, నిబద్ధతతో పార్టీని మరోసారి గెలిపించుకొని ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టి ప్రజా సంక్షేమానికి మరింతగా పాటుపడుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబటి బాలేష్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషణ్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ ఎస్ఎన్ చారి, పార్లమెంట్ కో కన్వీనర్ చింత సంతోష్‌కుమార్, మున్సిపల్ అధ్యక్షులు కిష్టమ్మగారి సుభాష్‌రెడ్డి, మండల అధ్యక్షులు అంబటి శివప్రసాద్ గౌడ్, నాయకులు దూలం వెంకట్ గౌడ్, సుంకు ప్రవీణ్, కిష్టమ్మగారి రమేష్‌రెడ్డి, అరిగె కృష్ణ, మచ్చ శ్రీను, పుట్ట వంశీ, తొగుట రవిందర్, వినీత్ గౌడ్, బెజ్జంకి సప్తగిరి, శ్రీకాంత్, బోయ రాజశేఖర్, భాను ప్రసాద్, శ్రీకాంత్‌రావు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లా మాజీ సైనిక విభాగం అధ్యక్షులుగా దుర్గా ప్రసాద్



పాపన్నపేట, అక్టోబర్ 10, మనం న్యూస్‌ః మెదక్ జిల్లా మాజీ సైనిక విభాగం అధ్యక్షులుగా ఎం. దుర్గా ప్రసాద్‌ను నియమిస్తూ ఏఐసిసి మాజీ సైనిక విభాగం అధ్యక్షులు కల్నల్ రోహిత్ చౌదరి ఉత్తర్వులు జారీ చేశారు. పాపన్నపేట మండలం లక్ష్మీనగర్ గ్రామానికి చెందిన దుర్గా ప్రసాద్ (టిటో)గత 25 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో సేవలు అందిస్తున్నారు. సైనికునిగా పదవీ విరమణ పూర్తయ్యాక ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ కోసం సేవ చేస్తున్న దుర్గా ప్రసాద్‌కు కాంగ్రెస్ పార్టీ గుర్తించి పదవి ఇవ్వడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పార్టీ ఇచ్చిన పదవికి వన్నె తెస్తానని, జిల్లాలో కాంగ్రెస్ గెలుపునకు కృషి చేస్తానన్నారు.

## మైనార్టీ ఆడబిడ్డ వివాహానికి పులిమామిడి రాజు ఆర్థిక సాయం



సదాశివపేట, అక్టోబర్ 10, మనం న్యూస్‌ః సదాశివపేట పట్టణానికి చెందిన నిరుపేద మైనార్టీ యువతి వివాహానికి బీజేపి రాష్ట్ర నాయకులు పిఎంఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ పులిమామిడి రాజు ఆర్థిక సాయం అందించారు. అనంతరం సంబంధిత వార్డు మైనార్టీ సభ్యులు మాట్లాడుతూ తమ ఆడకూతురు వివాహానికి మీ వంతు సహాయ సహకారాలు అందించినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. మీరు నియోజకవర్గంలో కుల, మత, వర్గ విభేదాలు లేకుండా చేస్తున్న సేవా కార్యక్రమాలు ఎంతో అద్భుతంగా ఉన్నాయన్నారు. నియోజకవర్గానికి తమలాంటి నాయకుడు కావాలని కోరుకున్నారు. ఈ మేరకు రాజు స్పందిస్తూ తన వంతుగా పెళ్లి ఖర్చుల నిమిత్తం ఆ కుటుంబానికి ఆర్థిక సాయం అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రంలో బీజేపి నాయకులు పిఎంఆర్ యువసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబడుతున్నా

**-ముదిరాజ్ బిడ్డగా మీ ముందుకొస్తున్నా**

**-నీలం మధు ముదిరాజ్**

**-ఈనెల 16 నుండి 'మీ కొడుకు మీ ఇంటి గుమ్మంలో' అనే నినాదంతో పాదయాత్ర**



పటాన్‌చెరు, అక్టోబర్ 10, మనం న్యూస్‌ః ఏ పార్టీ టికెట్ ఇస్తే ఆ కండువాతో ముదిరాజ్ సబ్బండ వర్గాలు ఆత్మగౌరవంగా ముందుకు వెళ్తామని, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సొంత పార్టీలో ఉండి కూడా ఇబ్బంది పెట్టారని నీలం మధు ముదిరాజ్ అన్నారు. తప్పుడు కేసులు బనాయించారని, ఇంత వరకు బిఆర్ఎస్ నుండి సానుకూల నిర్ణయం రాలేదని, ఈనెల 16వ తేదీ నుండి గుమ్మడిదల మండలం కొత్తపల్లి గ్రామంలో ప్రజల మధ్య పార్టీకి రాజీనామా చేసి పాదయాత్ర చేయనున్నట్లు ఎన్ఎంఆర్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షులు నీలం మధు ముదిరాజ్ అన్నారు. చిట్కుల్ గ్రామంలో నీలం మధు ముదిరాజ్ క్యాంప్ కార్యాలయంలో ఎన్ఎంఆర్ యువసేన అనుచరులు, సబ్బండ వర్గాల ప్రజలతో సమావేశం నిర్వహించి మీ కొడుకు మీ ఇంటి గుమ్మంలో పాదయాత్ర వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎన్నో సేవా కార్యక్రమాలు చేశానని, మా బిడ్డకు బిఆర్ఎస్ టికెట్ ఇవ్వలేదని రాష్ట్ర వ్యాప్తంగా ముదిరాజ్ జాతికి అన్యాయం జరిగిందని, బిసి సబ్బండ కులాలు నీలం మధు ముదిరాజ్‌ను మేమే స్వతంత్ర అభ్యర్థిగా నిలబెట్టుకొని గెలిపించుకుంటామన్నారు. నీలం మధు ముదిరాజ్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు తెలిపారు. ప్రతిపక్ష పార్టీల నుండి తమ పార్టీలో చేరమని ఫోన్‌లు వస్తున్నాయని, ముదిరాజ్‌ల ఆత్మగౌరవం ముఖ్యమని టికెట్ ఖరారు చేసిన రోజు చేరుతానని చెప్పానన్నారు. ఈనెల 16న ఉదయం 10 గంటలకు 1వ పోలింగ్ బూత్ నుండి ప్రజా సమస్యలు తీర్చడమే ప్రజల కోరికే మేనిఫెస్టోగా మీ కొడుకు మీ గుమ్మంలో అనే నినాదంతో పాదయాత్ర చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 60 లక్షలుఉన్న ముదిరాజ్‌ల ఆత్మగౌరవం మేరకు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తానన్నారు. 16 ఏళ్లప్పుడూ గులాబీ జెండాతో పార్టీని బలోపేతం చేసే విధంగా ఎన్నో కార్యక్రమాలు చేశామని, పార్టీ తనకు ఏం ఉపయోగపడిందనే దానికాన్న పార్టీ బలోపేతానికి తాను ఎన్నో కార్యక్రమాలు చేశానన్నారు. పార్టీలో ఉండి కూడా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తనను ఇబ్బంది పెట్టారని ఆరోపించారు. సీఎం కేసీఆర్ డబుల్ బెడ్‌రూమ్‌లకు వస్తుంటే కట్టిన ఫ్లెకీలు ఎమ్మెల్యే కుమారుడితో చింపించారని, చాకలిఐలమ్మ విగ్రహావిష్కరణ సమయంలో మూడుసార్లు వెళ్తే  ఉన్నా లేరని ఎమ్మెల్యే చెప్పించారన్నారు. ఇంతవరకు వేచి చూసామని, పిలకపోవడంతో ఇప్పుడు నిర్ణయం తీసుకున్నానన్నారు. ఏ పార్టీ అయినా టికెట్ ఇస్తానంటే ఆ కండువా కప్పుకొని పోటీ చేస్తానని, మీ బిడ్డనై వస్తున్నా, ప్రజాభిప్రాయం మేరకు అభివృద్ధి చేసుకుందమన్నారు. ఇప్పటి వరకుపిలుపు రాకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొల్లూరు మల్లేష్, మహేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్‌లు, ఎన్ఎంఆర్ యువసేన కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంపై అవగాహన

**గడీల శ్రీకాంత్ గౌడ్**



పటాన్‌చెరు, అక్టోబర్ 10, మనం న్యూస్‌ః పటాన్‌చెరు నియోజకవర్గ ఇస్నాపూర్ గ్రామ పరిధిలోని పద్మారావు నగర్ కాలనీలో భవన నిర్మాణ, ఇతర నిర్మాణరంగాల కార్మిక సంక్షేమ సంఘం నాయకులకు ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పతకంపై అవగాహన సదస్సును మాజీ జెడ్పిటిసి, బీజేపి ఓబిసి మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడీల శ్రీకాంత్ గౌడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతివృత్తుల వారికి సాధికారతనందించేందుకు ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన కొత్త పథకాన్ని అర్హులైన 18 కులవృత్తుల వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నైపుణ్యాభివృద్ధి కోసం చేతివృత్తుల వారికి శిక్షణ, శిక్షణ సందర్భంగా రోజుకు రూ.500 చొప్పున స్టైఫండ్ , అర్హులకు పనిముట్ల కొనుగోలుకు రూ. 15 వేల ఆర్థిక సాయం, హస్త కళాకారుల వ్యాపారాభివృద్ధి కోసం రూ. 3 లక్షల వరకు రుణం మొదటి దశలో ఏడాదికి 5 శాతం చొప్పున వడ్డీతో రూ. 1 లక్ష వరకు రుణం అందించడం జరుగుతుందన్నారు. రెండవ దశలో ఏడాదికి 5 శాతం చొప్పున వడ్డీతో రూ. 2 లక్షల వరకు రుణం అందించడం జరుగుతుందన్నారు. వారి ఉత్పత్తులకు తగిన మార్కెట్ సౌకర్యం కల్పిస్తూ ఉపాధి అవకాశాలు మెరుగుపరుచాలనేది ఈ పథకం ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ, ఇతర నిర్మాణ రంగాల కార్మిక సంఘం అధ్యక్షులు చిన్న మేస్త్రీ ఇస్నాపూర్ వార్డు సభ్యులు నారాయణదాసు, గోపాల్, డివిజన్ అధ్యక్షులు హనుమంతు, యాదగిరి, సెంట్రింగ్ అధ్యక్షులు ఆరె రాములు, తాపీ మేస్త్రీ అధ్యక్షులు మాలకొండ రెడ్డి, ప్రధాన  కార్యదర్శి రఘు, ఉపాధ్యక్షులు కొమురయ్య, మోహన్‌రెడ్డి, సహాయక కార్యదర్శి రాజేష్ పాల్గొన్నారు.